సాక్షి

# 10 ట్రిప్పులు ఫ్రీ




## విద్యార్థులకు మెట్రో సూపర్ సేవర్ పాస్‌లు

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల కోసం హైదరాబాద్ మెట్రో రైల్ బంపర్ ఆఫర్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం 20 ట్రిప్పులకు చార్జీలను చెల్లించి 30 ట్రిప్పుల వరకు ప్రయాణం చేసే సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. విద్యార్థులు 10 ట్రిప్పులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఇందుకోసం హైదరాబాద్ మెట్రో రైల్ సూపర్ సేవర్ స్టూడెంట్ పాస్–2023ను శనివారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి విడుదల చేశారు. అన్ని ప్రధాన మెట్రో స్టేషన్లలో ఈ పాస్‌లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మెరుగైన మెట్రో ప్రయాణ సదుపాయం కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. 1998 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత పుట్టిన విద్యార్థులందరూ ఈ పాస్ పొందేందుకు అర్హులు. ఈ ఆఫర్ కింద విద్యార్థులు 20 ట్రిప్పులకు మాత్రమే చెల్లించి, అన్ని ఫేర్ జోన్‌లలో 30 ట్రిప్పుల వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఉదాహరణకు ఉప్పల్ నుంచి అమీర్‌పేట్ వరకు

- 20 ట్రిప్పుల చార్జీలపై 30 ట్రిప్పుల వరకు ప్రయాణం
- వచ్చే ఏడాది మార్చి వరకు సూపర్ సేవర్ ఆఫర్
- ప్రధాన స్టేషన్లలో కొత్త స్మార్ట్‌కార్డులు

నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థి 20 ట్రిప్పుల చార్జీలతో స్మార్ట్‌కార్డు కొనుగోలు చేస్తే అది 30 ట్రిప్పుల వరకు చెల్లుబాటవుతుంది. ఆ తర్వాత తిరిగి రీచార్జ్ చేసుకోవచ్చు. విద్యార్థులు తమ ఐడెంటిటీ కార్డును చూపించి ఈ కార్డులను కొనుగోలు చేయవచ్చు. మరోవైపు ఈ సరికొత్త బ్రాండెడ్ స్మార్ట్ కార్డు ఈ జూలై నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అంటే 9 నెలల పాటు ఉంటుందని ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. ఒక విద్యార్థికి ఒక స్మార్ట్ కార్డ్ మాత్రమే జారీ చేస్తారు. కొనుగోలు చేసిన తేదీ నుంచి 30 రోజుల వరకు చెల్లుబాటవుతుంది.

### ఎక్కడ లభిస్తాయంటే..

- రెడ్‌లైన్‌లోని జేఎన్‌టీయూ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్, విక్టోరియా మెమోరియల్, దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్‌లలో. గ్రీన్ లైన్‌లో నారాయణగూడ మెట్రో స్టేషన్.. బ్లూలైన్‌లో నాగోల్, పరేడ్‌గ్రౌండ్స్, బేగంపేట్, అమీర్‌పేట్, రాయదుర్గం మెట్రో స్టేషన్లలో సూపర్ సేవర్ పాస్‌లు లభిస్తాయి.
- ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెట్రో స్టేషన్లలో పాస్‌లను కొనుగోలు చేయవచ్చు.
- మరోవైపు సూపర్ సేవర్ మెట్రో పాస్‌లను కొనుగోలు చేసిన విద్యార్థులకు హైదరాబాద్ మెట్రో రైలుతో అనుసంధానం కలిగిన రిలయన్స్ ట్రెండ్, 24 సెవెన్ కన్వీనియన్స్ స్టోర్‌లు, తదితర వాణిజ్య సంస్థల నుంచి రాయితీ కూపన్లు కూడా లభిస్తాయని అధికారులు తెలిపారు.
- ఈ పాస్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ www.ltmetro.comను సంప్రదించవచ్చు.

Date: 02/07/2023, Edition: Hyderabad (Hyderabad), Page: 11
Source : https://epaper.sakshi.com/